# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

అనునిత్యం ప్రజల పక్షం

TELTEL12273

ఎడిటర్ : బొల్లిపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ సంపుటి : 2 సంచిక : 289 శనివారం 12- 04 - 2025 పేజీలు : 08 వెల : 5

www.telanganamuchatlu.in



విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న
తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో
పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209




## రైతుల అకౌంట్లోకి నగదు జమ

**తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23,364 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా వెల్లడించారు. గడిచిన నెలలో కురిసిన వర్షాలకు 8,408 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నష్టపోయిన రైతులకు త్వరలోనే నష్టపరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అంతేకాకుండా.. ఏప్రిల్ 3వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు కురిసిన వర్షాలకు మరో 14,956 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ఈ మేరకు పూర్తి నివేదికలు అందిన వెంటనే ఈ రైతులకు కూడా పంట నష్టపరిహారం అందజేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటుందని.. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటుందని మంత్రి తెలిపారు. గతంలో కూడా రాష్ట్రంలో అకాల వర్షాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందజేసింది. గత సంవత్సరం అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు రూ. 10,000 చొప్పున పరిహారం అందించింది. ఈ చర్య ద్వారా వేలాది మంది రైతులకు ఆర్థికంగా కొంత ఊరట లభించింది. ఈసారి కూడా అదే తరహాలో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందజేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.గురువారం కురిసిన వర్షాలు, వడగళ్ల వాన కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20,000 పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి టి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్నాయని తెలుసుకున్న హరీష్ రావు వ్యవసాయ, ఉద్యానవన అధికారులతో మాట్లాడి రైతులకు వర్షం వల్ల ఎంత నష్టం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. పరిహారం కోసం ఒత్తిడి తెచ్చేందుకు గణన నిర్వహించాలని ఆయన అధికారులను సూచించారు. చిన్న కోడూరు, నంగనూరు మండలాల్లోని కొంతమంది రైతులతో కూడా మాట్లాడి నష్టం గురించి ఆరా తీశారు. ఆయన రైతులను ఓదార్చి.. ప్రభుత్వం పంట నష్టాన్ని భర్తీ చేయించేందుకు పాటుపడతానని వారికి హామీ ఇచ్చారు.

## అదే మా మంత్రం..!



**తెలంగాణ ముచ్చట్లు :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలో ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు. దేశానికి సేవ చేయాలనే మా మంత్రం.. "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" అని ఆయన అన్నారు. దేశం కోసం మేం అదే ఆలోచనతో ముందుకు సాగుతామన్నారు. అధికారం దక్కించుకోవడానికి పగలు రాత్రి ఆటలు ఆడే వారు కుటుంబ అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెడతారని విమర్శించారు. "పరివార్‌కే సాత్, పరివార్ కా వికాస్" వాళ్ల నినాదం అంటూ ప్రధాని ఎద్దేవా చేశారు. వారణాసిలో ప్రధాని మోదీ రూ.3880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. గత 10 సంవత్సరాలలో బనారస్ ఎంతో అభివృద్ధి చెందింది. నేడు కాశీ పురాతనమైనది కాదు, అది ప్రగతిశీలమైనది కూడా. కాశీ ప్రేమకు నేను రుణపడి ఉన్నాను. కాశీ నాది, నేను కాశీకి చెందినవాడిని అని మోదీ పేర్కొన్నారు.తన పార్లమెంటరీ నియోజకవర్గంలో అభివృద్ధి గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పూర్వాంచల్‌లో గతంలో ఆరోగ్య సౌకర్యాల కొరత ఉండేదని, కానీ నేడు కాశీ ఆరోగ్య రాజధానిగా మారుతోందని అన్నారు. ఈ రోజు ఢిల్లీ, ముంబైలలోని పెద్ద ఆసుపత్రులు మీ ఇంటి దగ్గరకు వచ్చాయి, ఇది అభివృద్ధి అంటే. గత 10 సంవత్సరాలలో మేం ఆసుపత్రుల సంఖ్యను పెంచడమే కాకుండా రోగుల గౌరవాన్ని కూడా పెంచాం. నేడు ఇండియా అభివృద్ధి, వారసత్వం రెండింటిలోనూ ముందుకు సాగుతోందని, కాశీ దీనికి ఒక అద్భుతమైన నమూనాగా మారుతోందని ప్రధాని 2లో

## తమిళనాట బీజేపీ



**తెలంగాణ ముచ్చట్లు :** తమిళనాట బీజేపీ %-% అన్నాడీఎంకే పొత్తు ఖరారు అయింది. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. సీఎం అభ్యర్థిగా పళనిస్వామి వ్యవహరించనున్నారు. రెండు పార్టీల పొత్తుపై బీజేపీ అగ్రనేత అమిత్‌షా ప్రకటన చేశారు. దీంతో అన్నాడీఎంకే అధికారికంగా %చీణూ% కూటమిలోకి జాయిన్ అయినట్లయింది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను అధికారం నుంచి గద్దె దించేందుకు తమ పార్టీ అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటుందని కేంద్ర హెూంమంత్రి, బీజేపీ ముఖ్య ఎన్నికల వ్యూహకర్త అమిత్ షా శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. 2026 లో తమిళనాడులో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన అన్నారు. బహిష్కరించబడిన అన్నాడీఎంకే నాయకులు ఓ పన్నీర్‌సెల్వం, ఏఎంఎంకే నాయకుడు టీటీవీ దినకరన్‌లను కూటమిలో చేర్చుకుంటారా అనే ప్రశ్నకు అమిత్ షా బదులిస్తూ, అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకోదని చెప్పారు.ఈ రెండు పార్టీలు జట్టు కట్టడంతో.. తమిళనాడు పాలిటిక్స్ ఆసక్తికరంగా మారాయి. ఇప్పటికే తమిళనాడు బీజేపీ చీఫ్‌గా నాగేంద్రన్‌ను ఖరారు చేసింది హైకమాండ్. గతంలో అన్నాడీఎంకేలో సుదీర్ఘకాలం పనిచేశారు నాగేంద్రన్.

## కేటీఆర్ సంచలన ఆరోపణలు



**తెలంగాణ ముచ్చట్లు :** హైదరాబాద్, ఏప్రిల్ 11: కొద్ది రోజులుగా హెచ్‌సీయూ భూముల వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. హెచ్‌సీయూ భూములు పరిరక్షించాలంటూ విద్యార్థులు ఆందోళనకు దిగగా.. ఆ భూములు తమవే అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. హెచ్‌సీయూ భూముల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. అలాగే ఈ భూములకు సంబంధించి ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఒక బీజేపీ ఎంపీ సపోర్ట్‌తో రేవంత్ రెడ్డి.. హెచ్‌సీయూ భూముల

## నిరుద్యోగులకు అదిరిపోయే గుడ్ న్యూస్



**తెలంగాణ ముచ్చట్లు :** వరంగల్ : తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో ఇవాళ(శుక్రవారం) మెగా జాబ్‌మేళా 2లో

## కేటీఆర్‌పై పీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

**తెలంగాణ ముచ్చట్లు :** హైదరాబాద్, ఏప్రిల్ 11: ఫార్ములా ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్ట్ కాక తప్పదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కు లింక్ పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా?.. దమ్ము ధైర్యముంటే చర్చకు రండంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్



## చేతులు కలిపిన హైడ్రా

**తెలంగాణ ముచ్చట్లు :** సాటిలైట్ సమాచారం తో చెరువులు ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, కబ్జాలకు కళ్లెం వేయడానికి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ తో హైడ్రా ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పంద పత్రాలపై హైడ్రా కమీషనర్ ఏవి రంగనాథ్, ఎన్ఆర్ఎస్సి డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్ సంతకాలు చేశారు. ఓఆర్ ఆర్ పరిధిలో భూముల వివరాలు అందరికీ అందుబాటులోకి తీసుకురాడానికి హైడ్రా కసరత్తు ప్రారంభించిందని రంగనాథ్ చెప్పారు. ఎక్కడ చెరువు ఉంది? 2లో

# అదే మా మంత్రం..!

వెల్లడించారు. చికిత్స కోసం భూమి అమ్ముకోవాల్సిన అవసరం లేదని, చికిత్స కోసం అప్పు తీసుకోవాల్సిన అవసరం లేదని, చికిత్స కోసం ఇంటింటికీ తిరిగే నిస్సహాయత ఇక ఉండదని ప్రధాని మోదీ అన్నారు. ఇప్పుడు మీ చికిత్సకు అయ్యే ఖర్చును ఆయుష్మాన్ కార్డు ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు.
కాశీలోని ప్రతి ప్రాంతం విభిన్నం.. కాశీలోని ప్రతి ప్రాంతానికి భిన్నమైన సంస్కృతి ఉందని, ప్రతి వీధిలో భారతదేశం విభిన్న రంగు కనిపిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ రోజు కాశీని సందర్శించే వారెవరైనా అక్కడి సౌకర్యాలను ప్రశంసిస్తారు. భారతదేశ ఆత్మ దాని వైవిధ్యంలో ఉందని, కాశీ దాని అత్యంత అందమైన చిత్రం అని మోదీ అభివర్ణించారు. ఇక్కడ గంగా ప్రవాహంతో పాటు భారతదేశ చైతన్య ప్రవాహం కూడా ఉంది అని పేర్కొన్నారు.

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

కుంభకోణానికి తెరతీశారని వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి పాలన అంటేనే.. మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడమనే త్రీడీ విధానంతో పేదల బతుకులను కాంగ్రెస్ నాశనం చేస్తోందని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు.

# చేతులు కలిపిన హైడ్రా

చెరువు విస్తీర్ణం ఎంత? కాలువలు, నాలాల పరిస్థితి ఏంటి..? అనే సమాచారంతో పాటు ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించి సరైన హద్దులతో సమాచారాన్ని హైడ్రా సేకరిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల వివరాలతో పాటు.. చెరువుల హద్దులు అందుబాటులో ఉంటే ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ఉంటుందని హైడ్రా కమిషన్ రంగనాథ్ తెలిపారు. చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడమే హైడ్రా ముందున్న లక్ష్యమని అన్నారు. 1970వ సంవత్సరంలో సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేసిన టోపో షీట్లు, కెడెస్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువులకు సంబంధించిన సమాచారంతో పాటు ఎన్ ఆర్ ఎస్ సీ శాటిలైట్ ఇమేజీలతో సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకురావడమే హైడ్రా లక్ష్యంగా చెప్పారు.
సహకారం ఎలా ఉంటుంది?
విపత్తుల నిర్వహణ, నీటి వనరుల రక్షణ కోసం జియో ఆధారిత జియోస్పేషియల్ డేటా మద్దతు, సాంకేతిక సహకారం హైడ్రాకు అందుతుంది. రిమోట్ సెన్సింగ్ %�ు +×ూ% సాంకేతికతను వినియోగించి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్) కోసం భౌగోళిక డేటాబేస్‌లను సమగ్రపరిచే భౌగోళిక పోర్టల్ అభివృద్ధితో పాటు జియోస్పేషియల్ డేటాబేస్ సృష్టికి సాంకేతిక మద్దతును బృందానికి అందిస్తుంది.భువాన్ పోర్టల్‌లో ఉన్న %ుజఖ=% పరిధిలో విపత్తు నిర్వహణ మరియు నీటి వనరుల రక్షణకు సంబంధితంగా ఉండే అన్ని వారసత్వ సమాచారాన్ని ఈ ఒప్పందం ప్రకారం %చీ=ూజ% అందించడానికి సిద్ధంగా ఉంటుంది. కొత్త 'జియోస్పేషియల్ డేటా పాలసీ %–% 2023' కు అనుగుణంగా 'భూనిధి' పోర్టల్‌లో ఉన్న అన్ని చారిత్రక భారతీయ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ డేటా %ుజఖ=% ప్రాంతాన్ని కవర్ చేసే మార్గదర్శకాలు అందుబాటులోకి వస్తాయి.
హై–రిజల్యూషన్ ఉపగ్రహ డేటా, వైమానిక ఫోటోగ్రఫీ, డిజిటల్ ఎలివేషన్ మోడల్స్ మొదలైనవి ఎన్ ఆర్ ఎస్ సీ ద్వారా  కు అందుతాయి. ఉపగ్రహం / వైమానిక వనరుల నుంచి సంబంధిత డేటాను తయారు చేయడం, వాటి ఏకీకరణ, ఆస్తి నిర్వహణ / పర్యవేక్షణ కు సంబంధించిన సమాచార సేకరణలో హైడ్రాకు ఎన్ ఆర్ ఎస్ సీ నుంచి అందుతుంది. కి చెందిన 'నేషనల్ డేటాబేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్' వెబ్ పోర్టల్‌కు ఉచిత యాక్సెస్‌ను అందిస్తుంది. ఇది ఇంటిగ్రేటెడ్ ఏరో–స్పేస్ ఆధారిత విపత్తు డేటాను ఉన్న స్థితిలోనే విజువలైజేషన్ చేయడానికి వీలు కల్పిస్తుంది.
ఔటర్ రింగ్ రోడ్  వరకు ఉన్న ప్రాంతంతో పాటు చుట్టూ ఉన్న 27 మునిసిపాలిటీలు/ కార్పొరేషన్ల పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి ఎన్ ఆర్ ఎస్ సీ %–% హైడ్రా సంయుక్తంగా కృషి చేస్తాయి.

# నిరుద్యోగులకు అదిరిపోయే గుడ్ న్యూస్

నిర్వహించారు. ఈ మెగా జాబ్‌మేళాను మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. 60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సాధించారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై పదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహారించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 60వేల ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కష్టం.. అందుకే ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం దక్కుతుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# కేటీఆర్‌పై పీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

కేసీఆర్ కుటుంబమని ఆయన అభివర్ణించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనని ఆయన గుర్తు చేశారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని.. ఈ మాటలను నమ్మకండంటూ తెలంగాణ ప్రజలకు పీసీసీ చీఫ్ సూచించారు. కేటీఆర్ ఇంతగా దిగజారుతాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడి చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు.బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని పేర్కొన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చుకున్నాడో అర్థం కావడం లేదన్నారు. సగం సగం తెలుసుకొని రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ మాట్లాడుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కుల గణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. బీఆర్ఎస్ పదేండ్లలో ఎన్ని వేల ఎకరాలను కొల్లగొట్టారో తెలియదా? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులు బాగు పడుతుంటే కేటీఆర్‌కి కడుపు నొప్పి వస్తోందని ఎద్దేవా చేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా? అంటూ బీఆర్ఎస్ నేతలు సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ దోపిడీని భరించ లేకనే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు గెలిపించారన్నారు. గత పదేండ్లలో జరిగిన భూ దోపిడీపై విచారణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
పెద్దమందడి మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమాన్ని గూపని వెంకటేష్ మరియు గ్రామ పెద్దలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహాత్మ జ్యోతిరావు పూలే గారికి భారతరత్న ప్రకటించాలి అని డిమాండ్ చేస్తున్నాం ఈ దేశ చరిత్రలో మొట్టమొదటిసారి, సమాజ అట్టడుగు పొరల్లో ఉండి, చదువుకు దూరంగా ఉన్న, మహిళలకు శూద్ర, అతిశూద్రులకు, చదువును చెప్పడం ద్వారా ,చదువు మీద హక్కును సమాజపరం చేసిన, విప్లవకారుడు ఆయన.. చదువుని చెప్పడమే కాకుండా అప్పటిదాకా సమాజంలో ఉనికిలో ఉన్న ఆశాస్త్రీయమైన,సమాజానికి పనికిరాని సెలబస్ను మార్చి,గణితాన్ని, చరిత్రను, పరిశుభ్రతను, వ్యవసాయాన్ని, సిలబస్లోకి తీసుకొచ్చి తను స్థాపించిన పాఠశాలల్లో వాటిని బోధించాడు.1882 ఇండియన్ ఎడ్యుకేషన్ కమిషన్( హంటర్ కమిషన్) కు విద్యా కు సంబంధించిన ముఖ్యమైన నివేదికను ఇచ్చాడు. సూచనలు కూడా చేశాడు. బొంబాయిలో 10 లక్షల మంది విద్యార్థులకు చదువు లేదని, పూణేలో కేవలం 30 మంది పిల్లలె చదువుకుంటున్నారని, వీళ్ళ కోసం బడులు పెట్టాలని, అంతేకాకుండా ఉపాధ్యాయుల జీతాలు పెరగాలని, పాఠశాలను తనిఖీ చేయడానికి అకడమిక్ ఇన్స్పెక్టర్లను నియమించాలని, తన ప్రతిపాదనలను హంటర్ కమిషన్ ముందుకు ఉంచాడు.



ముఖ్యంగా సత్యశోధక సమాజ్ ను స్థాపించి,ఒక ఉపాధ్యాయుడిగా తన సామాజిక బాధ్యతలో భాగంగా అప్పటికే సమాజంలో అధిపత్యంలో ఉన్న, సనాతన మూఢవిశ్వాసాలపై తిరగబడ్డాడు.
బాలహత్య వ్యతిరేక గృహాలను స్థాపించాడు, పురోహితుడు లేని వివాహాలు చేసాడు.తన కలానికి పదును బెట్టి గొప్ప రచనలు చేసాడు.
తన భార్య సావిత్రిభాయిని ఈ సంఘర్షణలో భాగం చేసాడు.
ఈ క్రమంలో దాడులకు గురయ్యాడు. కుటుంబానికి దూరమయ్యాడు,సమాజంతో ఘర్షణ పడ్డాడు.
మహాత్మా పూలే స్పూర్తితో అందరికీ నాణ్యమైన ఉచిత విద్య కోసం, శాస్త్రీయమైన, కామన్ స్కూల్ విద్యా విధానం కోసం ఉద్యమిద్దాం అట్టడుగు ప్రజల హక్కుల కోసం ఉద్యమిద్దాం
ఈ కార్యక్రమంలో
కొమ్ము చెన్నయ్య మాదిగ,రాజశేఖర్ శెట్టి,రాఘవేందర్ రెడ్డి,రవీందర్, కృష్ణవేణి పద్మ శేఖర్ గౌడ్ ,కొమ్ము చెన్నకేశవులు మాదిగ,
పంచాయతీ కార్యదర్శి టెక్నికల్ అసిస్టెంట్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాడే యూనియన్ టి డబ్ల్యూ జేఎఫ్

- సంఘ రాష్ట్ర జిల్లా నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఖదీర్
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం
- చరవాణి ద్వారా మాట్లాడిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- సత్తుపల్లి లో టి డబ్ల్యూ జేఎఫ్ సభ్యత్వ నమోదుకు భారీ స్పందన

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**
జర్నలిస్టుల సమస్యలపై నిఖార్సైన పోరాటం చేసుకుంటూ ముందుకు పోతుందని ఆ సంఘ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బట్టి పాటి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు సయ్యద్ ఖాదీర్ స్పష్టం చేశారు.
సత్తుపల్లి లోని స్థానిక లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో గురువారం టి డబ్ల్యూ జేఎఫ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ బాలకృష్ణ అధ్యక్షతన సత్తుపల్లి నియోజకవర్గస్థాయి జర్నలిస్టుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టిడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తుందనటానికి ఇటీవల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలే నిదర్శనం అన్నారు. జర్నలిస్టులకు రేషన్ కార్డులు ఇప్పించడం రాజీవ యువ వికాస్ పథకంలో జర్నలిస్టు కు ప్రాధాన్యత కల్పించే లా కృషి చేయటం. ఆరోగ్యశ్రీ కార్డులు అన్ని ఆసుపత్రిలో చెల్లుబాటు అయ్యేలా కృషి చేయడం జిల్లా మండల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన కోసం మంత్రులు అధికారులు కలవడం లాంటి కార్యక్రమాలు ఇటీవల కాలంలో టిడబ్ల్యూజేఎఫ్ విజయవంతంగా నిర్వహిస్తూ వస్తుందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కష్టపడే మనస్తత్వం ఉన్న సభ్యులను సంఘం గుర్తించి పదవుల కట్టబెడుతుందని అన్నారు.సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ ,రవికిరణ్ ,మాధవరావు, సంజీవరావు, అయ్యప్ప, జర్నలిస్టుల సమస్యలపై ప్రసంగించారు.
సత్తుపల్లి లో టి డబ్ల్యూ జేఎఫ్ సభ్యత్వ నమోదుకు భారీ స్పందన టి డబ్ల్యూ జేఎఫ్ నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ ,మండలాల జర్నలిస్టులు మంచి భారీ స్పందన వచ్చింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం సాధన కోసం టి డబ్ల్యూ జేఎఫ్ జిల్లా నాయకత్వం ఇటీవల కాలంలో నిర్వహించిన కార్యక్రమాలే ఈ భారీ స్పందన రావడానికి కారణమైందని ఆ రెండు యూనియన్ల కు చెందిన పలువురు జర్నలిస్టులు



ఆయా సంఘాలకు రాజీనామా చేసి టిడబ్ల్యూజేఎఫ్ లో గురువారం 50 మందికి పైగా చేరారు.
జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ టిడబ్ల్యూజేఎఫ్ కి తమ మద్దతు తోడు ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చరవాణి ద్వారా తెలిపారు.సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జానీ, మూర్తి,మల్లూరు చంద్రశేఖర్ సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, మండలాల రిపోర్టర్లు,గోదా నాగబాబు, కొత్తపల్లి సుధాకర్, ఏ.అనిల్, కరుణాకర్, జి.వెంకటేశ్వరరావు, రాఘవ, వేలాద్రి, ముస్తఫా, మీరా, మోహన్ రాజ్, బాజీ ,మోహన్, సూర్య ,జగన్, అశోక్, రోషిని, సునీత, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మనువాదంపై పోరాడడమే పూలే కు అర్పించే నిజమైన నివాళి సిపిఎం



**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**
సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యం లో ఘనంగా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు సత్తుపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు.
మనువాదంపై పోరాటాలు చేయడమే నేడు జ్యోతిరావు పూలేకు అర్పించే నిజమైన నివాళి అని, మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి అని సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పూలే జయంతి సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని కుల జాడ్యం మన దేశంలోనే ఉన్నదని, వేల సంవత్సరాలు గా కులం పేరుతో ఆధిపత్యం చేస్తూ సామాజిక, ఆర్థిక దోపిడీ కొనసాగిన దానికి వ్యతిరేకంగా తమ జీవితాంతం సమాజంలో ఉన్న అసమానతలు పై పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారులని పూలే దంపతులను కొనియాడారు. నేడు దేశంలో పాలిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ పాలకులు పచ్చి మతోన్మాద అవకాశవాద రాజకీయాలను నడుపుతూ దేశంలో వైషామ్యాలను రెచ్చగొడుతూ మరల పాతకాలపు నీచమైన రాచరిక వ్యవస్థలోకి తీసుకెళ్ళే దుష్ట ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. పూలే స్పూర్తితో సామాజిక, కుల అణచివేతలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావుల రాజబాబు, చావా రమేష్, మహమ్మద్ అలీ, వెంకటేశ్వరరావు, భాస్కర్ చప్పిడి, బడే మియా,వలీ మరియు తదితరులు పాల్గొన్నారు

# విశ్వశాంతి లో పూలే జయంతి వేడుకలు.



**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**
దీన జనుల సముద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలె 198వ జయంతి వేడుకలను సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు.సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం పూలే చిత్రపటం వద్ద పుష్పాలను ఉంచి నివాళి ఘటించారు.అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు పూలే దంపతులు తమ జీవితాలను అంకితం చేసారని సృజన నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ అన్నారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కొరకు విద్యా సంస్థలను,వితంతువుల సంక్షేమం కొరకు ప్రత్యేక గృహాన్ని ఏర్పాటు చేసిన త్యాగధనుడు పూలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మధుసూదన రాజు, పాఠశాల యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ళ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

## బిజెపి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పెద్దమందడి మండల అధ్యక్షుడు ముప్పూరు చెన్నయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఏప్రిల్ 10 11 12 వ తేదీలలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా.. చిన్నమందడి గ్రామ పంచాయతీలో సమస్యలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్, హర్ ఘర్ ముద్ర, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్, అన్న యోజన వంటి అనేక సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివరించారు. అలాగే పామిరెడ్డిపల్లి స్కూలు పిల్లలకు మధ్యాహ్న భోజన సమస్యల గురించి తెలుసుకున్నారు. దొడిగుంటపల్లి, వీరాయిపల్లి, చీకరు చెట్టు తాండ ముందరి తండా జంగమయ్యపల్లి బలిజపల్లి అనకాపల్లి తండా గ్రామాలలో ప్రజలను కలిశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య ,మండల ప్రధాన కార్యదర్శి సుక్క మధు, దత్తాత్రేయ రెడ్డి, కార్యదర్శి వెంకటేష్, బూత్ అధ్యక్షులు నాగరాజు, బాలకృష్ణ మార్షరాజు, సీనియర్ నాయకులు బాలరాజు, పెద్ది రామకృష్ణ ,వెంకటాచారి, చంద్రమౌళి, హనుమంతు నాయక్ ,రాజు నాయక్, కృష్ణ యాదవ్, పాండురంగ, తదితరు లు గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రైతు సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు!

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ రైతు సంఘం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కాకర్లపల్లి గ్రామంలో తెలంగాణ రైతు సంఘం 89వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ముందుగా రైతు సంఘం జెండాను ఆవిష్కరణలు చేసి అనంతరం రావుల రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో, రైతు సంఘం నాయకులు మోరంపూడి పాండురంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాజిరి శ్రీనివాస్, సిఐటియు నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. 1936 ఏప్రిల్ 11 ఆవిర్భవించిన నాటినుండి నేటి వరకు రైతాంగ సమస్యలపై అనునిత్యం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ జాతీయ ఉద్యమంలో భారతదేశానికి స్వతంత్రం కోసం నిర్వహించిన పోరాటంలో అఖిల భారత రైతు సంఘం పాత్ర అమోఘమైందని అన్నారు. దేశవ్యాప్తంగా త్రాగునీరు సాగునీరు రుణ సదుపాయం సబ్సిడీపై రైతులకు యంత్రాలు ఇవ్వాలని రైతు సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు అదేవిధంగా తెలంగాణలో నైజాం నిజాం కు వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి ఇవ్వాలి తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం నిర్వహించింది 11వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర రైతు సంఘానికి ఉందనే అన్నారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు తెబాక , వర్లి కేరళలో పున్నవాయి పోరాటాలు నిర్వహించింది కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్ల చట్టాలన మూడు చట్టాలను తీసుకువచ్చిన నేపథ్యంలో నల్ల చట్టాలు రద్దు కోరుతూ అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించడం జరిగింది నల్ల చట్టాలు వెనక్కి కొట్టడంలో కీలక భూమిక పోషించిందన్నారు, అదేవిధంగా తెలంగాణలో కూడా ప్రభుత్వం అమలు చేస్తామన్న రెండు లక్షల రుణమాఫీని





అదేవిధంగా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలని అన్నారు అంతేకాకుండా దాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని అన్నారు. అంతేకాకుండా ఈ జిల్లాలో పంటలకు నీటి సమస్య రాకుండా (దుమ్ముగూడెం ప్రాజెక్టు) సీతారామ ప్రాజెక్ట్ కట్టాలని ఖమ్మం జిల్లాలో పాదయాత్ర చేసిన చరిత్ర తెలంగాణ రైతు సంఘానికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొలికపోగు సర్వేశ్వరరావు, చావా రమేష్, మేడ సత్యనారాయణ, కంచర్ల సత్యం, చీకటి మనోహర్, నరసింహారావు, రాములు, వసంతరావు, పార్వతీ కృష్ణవేణి, మరియు తదితరు రైతులు పాల్గొన్నారు

# పెద్దమందడి అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
పెద్దమందడి మండలం అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లల పోషకాహారం గురించి అలాగే చిరుధాన్యాలపై అంగన్వాడి సూపర్వైజర్ సుధా, అంగన్వాడీ టీచర్స్ మహిళలకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలలో లభించే ప్రోటీన్స్ విటమిన్ ల గురించి వివరంగా తెలియజేయడం జరిగింది. గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, పిల్లలకు ఈ ఆహారం తీసుకోవాలని సూచించారు. స్త్రీలు, మరియు పిల్లల ఆరోగ్యం మెరుగుపరచడం, సమాజంలో పోషకాహారం పై అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్స్ సుధా, అంగన్వాడీ టీచర్స్ రాణి, రమాదేవి, చిట్టెమ్మ, ఆశ వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి చదువుకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆర్థిక సహాయం!




**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:** పెనుబల్లిమండల పరిధిలోని కరాలపాడు గ్రామానికి చెందిన సాతునూరి ప్రణీత్ వెటర్నరీ సైన్స్ ఫస్ట్ ఇయర్ మామునూరు వరంగల్ జిల్లా నందు చదువుతున్నాడు.తండ్రి శ్రీనివాసరావు,తల్లి కమల కుమారి వ్యవసాయ కూలీలు కావడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరక రామారావు ఆయన బృందంతో స్వయంగా విద్యార్థి ఇంటికి వెళ్లి ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని ఇదే విషయాన్ని స్ఫూర్తి ఫౌండేషన్ దాతల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వారు స్పందించి విద్యార్థికి ఒక సంవత్సరానికి అయ్యే ఫీజు 1,00,000/- (లక్ష రూపాయలు) చెక్ ను విద్యార్థి కి అందించారు. ఇంతటి గొప్ప సహాయాన్ని అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ దాతలకు విద్యార్థి కుటుంబం, బంధువులు, గ్రామస్తులు, కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక
శనివారం 12-04- 2024
వరంగల్


# ఆశా వర్కర్ల విజ్ఞప్తిని స్వీకరించిన ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ -జిల్లెల ఆదిత్య రెడ్డి






**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:** తెలంగాణలోని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ కేర్ వర్టికల్ శుక్రవారం ఆశా వర్కర్ల తరపున మహాత్మ జ్యోతిబాపూలే ప్రజా భవన్ ప్రజా వాణిలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కి ఒక పిటిషన్ సమర్పించడం జరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్ కింద నవజాత శిశు సంరక్షణ, ప్రసవానంతర సంరక్షణ, ఎన్ సి డి సంరక్షణ నుండి సమాజంలోని అత్యంత అణగారిన వర్గాలకు అమూల్యమైన కమ్యూనిటీ ఔట్రీచ్ సేవలను అందించే ఆశా వర్కర్ల బృందం గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్త మెరుగైన వేతనాలు, భీమా మరియు పని పరిస్థితులను డిమాండ్ చేస్తున్నారు. డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి నేషనల్ హెల్త్ కేర్ హెడ్, స్టేట్ హెడ్ ముజ్తబా హసన్ అస్కారితో కలిసి ఏఐపిసి ప్రతినిధి బృందం రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర్ రాజా నర్సింహా ను కలిసారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం త్వరలో ఆశా వర్కర్ల సమస్యలను అనుకూలంగా పరిష్కరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# పెద్దమందడి బిసి రాజకీయ నాయకులు ఐక్యంగా ఉండాలి

## మండలంలో బలమైన బీసీ నాయకుని కోసం ఎదురుచూపు - వెల్టూర్ బీసీ నాయకులు



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలంలోని వివిధ పార్టీల బీసీ రాజకీయ నాయకులు అందరూ ఐక్యంగా ఉండాలని వెల్టూర్ గ్రామ బీసీ నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం వివిధ పార్టీల బిసి నాయకులు వెల్టూర్ లోని ఓ హోటల్లో సమావేశమై రాజకీయంగా బీసీల పట్ల జరుగుతున్న పరిణామాలపై చర్చించుకున్నారు. బీసీల పట్ల రాజకీయంగా జరుగుతున్న పరిణామాలపై తీవ్రంగా ఆలోచించాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలందరూ ఏకతాటిపై వచ్చి ముందుకెళ్లాలని మాట్లాడటం జరిగింది. ముఖ్యంగా మండలంలో బీసీ నాయకులకు సరైన నాయకుడు లేకపోవడం, ఉన్న నాయకులు ఆధిపత్య వర్గం వైపు వెళ్లడం వల్ల బీసీ నాయకులకు బలమైన నాయకుడు కావాలని కోరుకుంటున్నారు. బీసీలందరూ ఐక్యంగా లేకపోవడం వల్లనే అగ్రవర్ణ నాయకుల ఆదిపత్యం లో బీసీలను బానిసలుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఓ బలమైన బీసీ నాయకుని కోసం ఎదురుచూస్తున్నట్టు, అందరూ కలిసికట్టుగా ఉండి స్థానిక ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలని చూస్తున్నారు. ఇప్పటికైనా పెద్దమందడి మండలంలో ఉన్న బీసీ నాయకులు ఆలోచించాలాని కోరుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ ఒక తాటి మీదికి వచ్చి ఏ పార్టీలో ఉన్న బీసీ నాయకులకు ఓట్లు వేయాలన్నారు. బీసీ లందరూ ఐక్యంగా ముందుకు వెళితేనే అగ్రవర్ణం అధిపత్యానికి నాంది పలకవచ్చని పలువురు బీసీ నాయకులు భయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సాక వెంకటయ్య, మాజీ సర్పంచ్ చింతల వెంకటేష్, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు వేణు యాదవ్, చిలుకటోనీ పల్లి డీలర్ శ్రీనివాసులు, సాంబ యాదయ్య, వివిధ గ్రామాల బిసి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.



**హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు.** మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా హసన్ పర్తి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీ కుమార్ ఎస్ డి ఎల్ సి ప్రాంగణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ భారతదేశ చరిత్ర కుల వ్యవస్థతో లోతుగా ముడిపడి ఉందని ఈ కఠినమైన సామాజిక నిర్మాణాన్ని ప్రశ్నించిన అనేకమంది నేతలలో మహాత్మ జ్యోతిరావు పూలే ఒక ప్రముఖ వ్యక్తి అని అన్నారు. కేవలం వివక్షను ఎదిరించడమే కాకుండా సామాజిక న్యాయ ఉద్యమాలకు పునాది వేసి కులం సంఘర్షణ సిద్ధాంతాలపై ఆయన చూపిన దృక్పథం విప్లవాత్మకమైనదని ఆయన పోరాటం కేవలం అసమానతను నిరసించడానికి మాత్రమే కాదు సమానత్వం న్యాయంపై ఆశయాన్ని నిర్మించేందుకు కూడా సాగింది విద్యకు ప్రాముఖ్యత ఇవ్వడంలో భాగంగా ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే కి సహకారంతో బాలికల కోసం దేశంలోనే మొట్టమొదటి పాఠశాలను స్థాపించారు. ఆయన పాఠశాలలో దళితులకు, స్త్రీలకు విద్యను అందించారు. ఈ కార్యక్రమంలో సంఘాల విక్టర్ బాబు, జట్టి రాజేందర్, చుంచు రాజేందర్, మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడు సిఎం రేవంత్ రెడ్డి

- రేవంత్ తోనే మాదిగలకు న్యాయం జరిగింది
- మాదిగల పెద్దన్న సిఎం రేవంత్ రెడ్డి
- సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పిడమర్తి
- గ్రామ గ్రామాల్లో సంబరాలు చేసుకోవాలి
- మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి





**ఫాతిమా నగర్,తెలంగాణ ముచ్చట్లు:** మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మాదిగ సమాజంలో ఆనందోత్సాహం వెల్లివిరిసింది. ముఖ్యమంత్రి పదవి మీదున్నా, మానవతా విలువలు, న్యాయబద్ధతను ప్రాతినిధ్యం వహిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడు సీఎం రెవంత్ రెడ్డి అని మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి ప్రశంసించారు.
ఫాతిమా నగర్‌లోని మదర్ థెరిసా విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పిడమర్తి రవి మాట్లాడుతూ, "మాదిగ కుటుంబాల కళ్లల్లో వెలుగు నింపిన మహానుభావుడు రెవంత్ రెడ్డి. కాలాలు మారినా, నాయకులు మారినా, మాదిగల సమస్యలు అలాగే ఉండిపోయాయి. కానీ, ఈ రోజు ఆ చీకటికి ముగింపు పలికే రోజు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, గవర్నర్ సంతకం వరకూ దీక్షగా పోరాడిన రెవంత్ రెడ్డి ప్రజా నాయకుడిగా నిలిచారు," అన్నారు.
అందుకే రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో, పట్టణాల్లో మాదిగలు సంబరాల్లో చేసుకుంటున్నారని,
స్వీట్లు పంచుకుంటూ, విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తూ ఈ చారిత్రక విజయాన్ని ప్రజలు స్మరించుకుంటున్నారని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ, కాడపాక రాజేందర్, మంద ఆరోగ్యం, వసంత రావు, నక్క మహేష్, మీసాల మహేష్, సుభాష్ శ్రీను, రఘురామ్ అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

**కరుణాపురంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చారిత్రక నిర్ణయానికి గుర్తింపుగా, ధర్మసాగర్ మండలంలోని కరుణాపురంలో మాదిగలు ఘనంగా స్పందించారు. 9% రిజర్వేషన్ అమలుపై హర్షాతిరేకంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి హాజరై స్వయంగా క్షీరాభిషేకం చేశారు. "ఇది మాదిగల పోరాటానికి గెలుపు సంకేతం. ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి మాట నిలబెట్టుకుని మాకు న్యాయం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు," అని ఆయన అన్నారు.
విద్యార్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు. గ్రామం అంతా ఉత్సవ వాతావరణాన్ని తలపించింది. స్వీట్ల పంపిణీ, విజయధ్వజాల ఊరేగింపులతో గ్రామమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత నాయకులు పాల్గొన్నారు. గ్రామస్తులు సీఎం రేవంత్ రెడ్డికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

## వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి విజేతలకు బహుమతులు అందజేస్తారు. చివరి మ్యాచ్ పెద్దమందడి మరియు మణిగిల్ల గ్రామాలు తలపడగా హోరా హోరీగా జరిగిన ఈ మ్యాచ్లో మణిగిల్ల విజయం సాధించింది. అదేవిధంగా పెద్దమందడి రన్నర్స్ గా నిర్ణయించారు.
బహుమతుల ప్రధాన స్థలంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొత్తకాపు రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, క్రీడా స్ఫూర్తిని చాటాలని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో గెలుపోటములు సహజం ఓడినవారు నిరాశ చెందకుండా తమ తప్పును గ్రహించి గెలిచేందుకు ప్రయత్నించాలన్నారు. అదేవిధంగా ఇరు జట్లు మణిగిల్ల, పెద్దమందడి క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బహుమతులు ప్రధానం చేశారు. ఇట్టి కార్యక్రమానికి వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొత్తకాపు రామకృష్ణ రెడ్డి, పెద్దమందడి మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, అల్వాల మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్ రెడ్డిగారు వెల్టూర్ బాబు రెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్మసాగర్‌లో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

## విద్య, సామాజిక సమానత కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయం

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** జాతి నిర్మూలన, విద్యా విస్తరణ, మహిళా సంక్షేమానికి పాటుపడ్డ మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, హనుమకొండ జిల్లా ఎంఎస్పి అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ తదితరులు, "పూలే సతీమణి సావిత్రిబాయిని విద్యారంగానికి ప్రవేశపెట్టి, ఆమె చేత ఒక శక్తిగా మారుస్తూ భారతదేశంలో తొలి బాలికా పాఠశాలను స్థాపించారు. వితంతువుల రక్షణకు ఆశ్రయాలనూ ఏర్పాటు చేశారు. అన్ని మతాలు, కులాల వారు కలిసి ఉండే సమాజానికి బీజం వేశారు," అని పేర్కొన్నారు.సామాజిక సమానత కోసం పూలే చేసిన కృషి అనంతమైనదని, ఆయన ఆలోచనలు ఈనాటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని వారు అన్నారు. ఈ తరానికి పూలే జీవితం స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ



కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సోంపల్లి అన్వేష్, ప్రధాన కార్యదర్శి చిలుక రాజు, వివెచ్‌పిఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బొడ్డు ప్రణయ్, నక్క రమేష్, రీపిక మహేష్, బొడ్డు శ్రవణ్ కుమార్, చిలుక సోమన్న, బొడ్డు జానీ, నాగచైతన్య, హర్షవర్ధన్, మని కృష్ణ, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# నర్మేటలో దేశంలోని అత్యుత్తమ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీప్రారంభానికి సన్నాహాలు

## -మంత్రులు తుమ్మల, పొన్నం, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి పర్యటన





**సిద్దిపేట,తెలంగాణ ముచ్చట్లు:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నర్మేటలో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు చివరి దశలోకి చేరాయి. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే ప్రథమ శ్రేణికి చెందిన ఆయిల్ ఫ్యాక్టరీగా నిర్మాణం జరుగుతోందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వారు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డితో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి, జూన్ లోపు అన్ని పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల సమక్షంలో, అధికారికంగా ఈ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. చైర్మన్ జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ, "ఈ ఫ్యాక్టరీలో కేవలం నూనె ఉత్పత్తి మాత్రమే కాదు, రిఫైనరీ ఏర్పాటుతో నేరుగా మార్కెట్‌కు తుది ఉత్పత్తులు పంపించే అవకాశముండబోతుంది. ఇది ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ఎంతో లాభదాయకం," అన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, "భారతదేశానికి ప్రతి ఏడాది 1 కోటి టన్నుల పామాయిల్ అవసరమవుతుంది. కానీ దేశీయంగా కేవలం 3 లక్షల టన్నులే అందుబాటులో ఉన్నాయి. మిగతాది మలేషియా, ఇండోనేషియా వంటి దేశాల నుంచి దిగుమతి అవుతుంది. కాబట్టి దేశీయంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడం అత్యవసరం. ఈ ఫ్యాక్టరీ రైతులకు ఆర్థికంగా మార్గదర్శిగా నిలుస్తుంది," అని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్ భాష, జిల్లా కలెక్టర్, ఆయిల్ ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పర్యటన



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి జిల్లాలో శనివారం పర్యటిస్తారు. తొలుత ఉదయం 10:30 గంటలకు నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో ఆర్గానిక్ మేళాను ప్రారంభిస్తారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం4 గంటలకు నగరంలోని ప్రకాష్ నగర్ లో గోదాంను ప్రారంభిస్తారు. 4:30 గంటలకు శ్రీనివాస్ నగర్ లో.. సీపీఎం రాష్ట్ర నేత యర్రా శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు 58వ డివిజన్ దొరన్న కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 5:30 గంటలకు రఘునాథపాలెం మండలం జింకల తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6 గంటలకు రఘునాథపాలెం మండలం వీ. వెంకటాయపాలెంలో సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవానికి హాజరవుతారు. ఈ మేరకు.. ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన వెలువడింది.

# వరంగల్ సభకు దండుకట్టండి

- పాతికేళ్ల పార్టీ సభ దద్దరిల్లాలి
- గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలి
- రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర







**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భద్రాచలం నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులంతా దండుకట్టాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. పార్టీ పాతికేళ్ల సభ కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ ఇంచార్జ్ మానె రామకృష్ణ అద్యక్షతన స్థానిక రెడ్డి సత్రంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రవిచంద్ర వరంగల్ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఏప్రిల్ 27 గులాబీ పార్టీ పండుగ రోజని, ఆ రోజు గ్రామ గ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని అన్నారు. మీరంతా కష్టపడి గెలిపిస్తే.. ఇక్కడి ఎమ్మెల్యే మిమ్మల్ని, పార్టీని ద్రోహం చేసి వెళ్లిపోయారు. అయినా బాధ లేదు. రేపో మాపో మళ్లీ ఉప ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ గెలవడం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమవుతోంది. హామీల అమలు దగ్గర నుంచి, పాలనా పరమైన నిర్ణయాల వరకు అభాసుపాలవుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తే సహించేది లేదని.. కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.
పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు మాట్లాడుతూ వరంగల్ సభ దిగ్విజయానికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మానే రామకృష్ణ, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు రాంబాబు, నర్సింహ మూర్తి, దొడ్డి తాతారావు, ఆకోజు సునీల్, కృష్ణారెడ్డి, కణితి రాముడు, బోదెబోయిన బుచ్చయ్య, రేసు లక్ష్మీ, సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శనివారం 12-04- 2024

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU TELTEL12273 తెలుగు దిన పత్రిక

# భూభారతిని ప్రజలకు అంకితం చేస్తాం

**ఈ నెల 14న శిల్పారామం వేదికగా సీఎం చేతుల మీదుగా ఆ కార్యక్రమం నిర్వహణ**

**ధరణి పేరుతో గత ప్రభుత్వం ఒక కోటి 57 లక్షల ఎకరాలను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టింది**

**విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేసే కార్యక్రమం ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి రోజున సాయంత్రం ఐదు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రోజు మణుగూరులోని పినపాక శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... ఇందిరమ్మ ప్రభుత్వంలో ఏదైతే ఒక మైలురాయిగా పేదవాడికి కష్టంతో సంపాదించుకున్న భూములను భద్రత కల్పించే ఒక అద్భుతమైన భూభారతి చట్టం 2025 ని అన్ని జిల్లా కలెక్టర్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఈ సభకి ఆహ్వానించి, రాష్ట్రంలోనీ మారుమూల ప్రాంతంలో ఉండే భూములను ఆసాములకు ద్వారా మనస్ఫూర్తిగా ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ఎంతమంది, ఎన్ని శక్తులు, కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజల దీవెనలు ఉన్నంతకాలం ఈ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయలేరని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ధరణి ప్రవేశ పెట్టీ ఒక కోటి 57 లక్షల ఎకరాలను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టిందని విమర్శించారు. ధరణి మూడేళ్ల పాటు అమల్లో ఉన్న రూల్స్ ను రూపొందించలేదని.... కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన భూభారతి చట్టానికి చట్టం రూపొందించిన అనతి కాలంలోనే రూల్స్ ను రూపొందించమని తెలిపారు. దీని ద్వారా చిన్న సమస్య కూడా క్షణాల్లో ప్రకారం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్,పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టు సాధికార కమిటీ సభ్యుడిని కలిసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**అవన్నీ.. ప్రభుత్వ భూములేనని వివరణ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి పలు అంశాలపై చర్చ**





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి పరిశీలనకు రాగా.. ఆ కమిటీ సభ్యులు సునీల్ లీమాయేను శుక్రవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి కలిశారు. ఈ భూములన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ భూములేనని, దశాబ్దాల కాలంలో జరిగిన పరిణామాలను వివరించి వినతి పత్రం అందజేశారు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి వెంట భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

సుప్రీంకోర్టు ఎంపవర్డ్ కమిటీ సభ్యుడికి ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి వివరించిన అంశాలు ఇలా..

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో గల 400 ఎకరాల భూమి పూర్తిగా ప్రభుత్వానిదే. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. "కంచ అస్తబల్ పోరంబోకే " అంటే ప్రభుత్వ భూమిగా నమోదైంది. 1975లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ)కి కంచ గచ్చిబౌలి లోని సర్వే నం బర్ 25, ఇతర సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమికి సంబంధించి.. ప్రత్యామ్నయం చూపించారు. పైన పేర్కొన్న భూమిని అప్పటి రిజిస్ట్రార్ పంచనామాపై సంతకం చేసిన తర్వాతనే.. రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ, అటవీ శాఖల రికార్డుల ప్రకారం ఆ భూమిని అటవీ భూములుగా నిర్ధారించలేదు.

# సాంప్రదాయ వైద్యులు వీరభద్రాచారికి అరుదైన గౌరవం

**సాంప్రదాయ పారంపర్య వైద్యానికి అంతర్జాతీయ సదస్సులో దక్కిన అవార్డు**



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**ఖమ్మం నగరానికి చెందిన రామడుగు వీరభద్రాచారి కి అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 9, 10, 11 తేదీలలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లో సాంప్రదాయ ఔషధ ఆధునిక పరిజ్ఞాన సహజ ఆరోగ్య రక్షణ సమగ్రత సమ్మేళనము అంతర్జాతీయ సదస్సు బోటనీ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సదస్సులో దేశ విదేశాలకు చెందిన అతిధులు, శాస్త్రవేత్తలు, పలు రాష్ట్రాలు లకు చెందిన ప్రతినిధులు సాంప్రదాయ వైద్యులు, ప్రొఫెసర్లు, పారంపర్య వైద్య మహా సంఘం సభ్యులు పాల్గొన్నారు. 46 సంవత్సరాల వయసు కలిగిన ఓ మహిళా పేషెంట్ కు గత నాలుగు సంవత్సరాలుగా ముక్కునుండి నిరంతరాయంగా ద్రవం కారుతోంది. ఎన్నో ఆసుపత్రులు తిరిగి వైద్యం చేయించుకున్నారు,మూడు సర్జరీలు చేయబడినా ఏ మాత్రం ఉపశమనం లభించలేదు. ఖమ్మం నగరానికి చెందిన సాంప్రదాయ వైద్యులు రామడుగు వీరభద్రాచారి పారంపర్యగానూ,గురు పరంపరగానూ గత నలభై సంవత్సరాల నుండి సాంప్రదాయ వైద్యానుభంవం తో ఈ వ్యాధికి పదిరోజుల్లో తొంభై శాతం,ముప్పై రోజుల్లో నూరు శాతం ఉపశమనం కల్పించారు. ఈ అద్భుత వైద్యానికి గుర్తింపుగాను

శ్రీ వేంటేశ్వరా విశ్వ విద్యాలయం,తిరుపతిలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో సంప్రదాయ వైద్యానికి ఓవరాల్ అవార్డును అందజేశారు.ఈ అవార్డును ముఖ్య అతిథి ఎస్ వి యూనివర్సిటీ తిరుపతి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిహెచ్.అప్పారావు , గౌరవ అతిథి యూనివర్సిటీ రిజిస్టర్ ఎం భూపతి నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జే కామాక్షమ్మ, బోటనీ డిపార్ట్మెంట్ ఎస్ వి యు , కన్వీనర్లు ప్రొఫెసర్ ఎం నాగలక్ష్మి దేవమ్మ, డాక్టర్ కామేశ్వర బద్రి, యు ఎస్ ఏ డాక్టర్ ఎం ఎం కేశవులు చేతుల మీదుగా రామడుగు వీరభద్ర చారి అవార్డును స్వీకరించారు. వీరభద్ర చారిని దేశ విదేశాలకు చెందిన అతిధులు, శాస్త్రవేత్తలు, ప్రశంసించి శాలువా మెమొంటో తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య ఆహ్వానితులు డాక్టర్ శ్రీనివాసరావు, ఫారంపర్య వైద్య మహా సంఘం ఏపీ అధ్యక్షులు వైద్య ఎం వేణుగోపాల్ రెడ్డి, సాంప్రదాయ ఎముకల నిపుణులు పుత్తూర్, వైద్య ఎస్ చంద్రశేఖర రాజు, వారంపర్య వైద్య మహా సంఘం తెలంగాణ అధ్యక్షులు వైద్య యత్రి మహర్షి తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి....

**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

- **ఆరోగ్యం, విద్య మాత్రమే మన భవిష్యత్తు తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి**
- **ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెం లో ఆంధ్ర బ్యాంక్ కర్షక సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు**రైతన్నలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లను మెల్ల, మెల్లగా మాని వేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెంలో ఆంధ్రా బ్యాంక్ కర్షక సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై క్షేత్ర స్థాయిలో రైతులతో ఇంటారాక్ట్ అవుతున్న సమయంలో మనకు పూర్వపు జనరేషన్ తాతలు, బామ్మలు మన కంటే మంచి ఆరోగ్యంతో ఉండటం గమనించామని అన్నారు. నేడు వైద్య శిబిరం ద్వారా పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. రైతుల ఆరోగ్యం కన్నా ముఖ్యమైన అంశం మరొకటి లేదని అన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ రైతుల కోసం మాత్రమే ఉందని, రైతుల కష్టాలను తొలగింపుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నమ్మకం కోల్పోవద్దని, మా స్థాయిలో ఉన్న సమస్యలను సంపూర్ణంగా పరిష్కరిస్తామని అన్నారు. రైతులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లను వదిలి వేయాలని కలెక్టర్ సూచించారు. లంగ్స్, లివర్ కిడ్నీ వంటి శరీర అవయవాలను మనం కాపాడుకోవాలని, ఇప్పటికే కాలుష్యం కారణంగా కొంతమేర ఆహారం కలుషితం అవుతుందని, దీనికి చెడు అలవాట్లు తోడైతే ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మనం తినే ఆహారంపై తప్పనిసరిగా శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ తెలిపారు. ఇంటిలో ఉన్న యువకుల ఆహారపు అలవాట్లు గమనించాలని, పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని, వారికి చెడు అలవాట్లు ఏవైనా ఉన్నాయోమో అని ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సరైన మార్గంలో నడపాలని, ఆరోగ్యానికి మించి ఆస్తి మనం



ఏమి ఇవ్వలేమని, ఆరోగ్యం, చదువు ఇది మాత్రమే మన పిల్లలకు మనమిచ్చే ఆస్తులను కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎబిఎఫ్ఎస్ఎస్ఎస్ చైర్మన్ బీరెడ్డి నాగ చంద్రారెడ్డి, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, ఖమ్మం రూరల్ ఎంపిడివో కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి - బహుజన రాజ్యాధికార స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిబా పూలే

## సామాజిక తెలంగాణ మహాసభ కన్వీనర్ కొత్తగట్టు మల్లన్న

**తెలంగాణ ముచ్చట్లు :** తిరుమలగిరి మండల కేంద్రంలో శుక్రవారం రోజు మహాత్మా జ్యోతిబా పూలే 199 వ జయంతి సందర్భంగా తిరుమలగిరి పూలే-అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మల్లన్న , బహుజన యుద్ధనౌక డా. ఏపూరి సోమన్న , బిఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా నాయకులు డా. ప్రవీణ్ కందుకూరి మాట్లాడుతూ.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి మహిళల విద్యకు బాటలు వేసిన ఆ మహనీయుడి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి పూలే

సావిత్రిబాయి పులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు.

సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడు.

వితంతు పునర్వివాహాల గురించి పూలే ప్రజల్లోచైతన్యం తీసుకువచ్చి స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించాడు.

1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" స్థాపించి, వితంతువులెట్కన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు. దేశంలోనే ఇటువంటి కేంద్రం స్థాపించడం ఇదే మొదటిసారి.

సత్యశోధక సమాజం తరపున ప్రారంభించిన 'దీనబంధు' వారపత్రికలో రెట్కతులు, కార్మికుల సమస్యలు, బాధలు వివరించేవారు.

భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికుడు పూలే. దుర్మార్గమైన కులవ్యవస్థ సమూలంగా నిర్మూలన కావాలని కోరుకున్న మొదటి వ్యక్తి పూలే

సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు.

సమాజంలో వెనుకబడినవర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతికోసం చేసిన కృషికి ఆయనకు 'మహాత్మ' బిరుదు ఇచ్చారు.

నిరంతరం సమసమాజ స్థాపన కోసం పరితపించిన మహాత్మ పూలే సమన్యాయ సత్యశోధకుడు భారతదేశంలోని దళిత



బహుజన, ఆదివాసీ గిరిజన, ముస్లిం మైనార్టీలు కుల వ్యవస్థలో బానిసలుగా ఉన్నారనీ, వీరు అమెరికాలోని నల్లజాతి బానిసల్లాగా ఉన్నారని చెప్పిన మొట్టమొదటి వ్యక్తి పూలే.

కుల వ్యవస్థలోని బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడడమొక్కటే మన ముందున్న ప్రథమ కర్తవ్యంగా పూలే ప్రకటించారు.

బడుగులు బానిసలుగా ఉండడానికి దోపిడీ, అణచివేత, వివక్షలను అర్థం చేసుకోకపోవడం, అందుకు చదువు లేకపోవడమే మూలమని పూలే గ్రహించాడు.

మొట్టమొదటగా దళిత బాలికలకు పాఠశాల నెలకొల్పారు. ఆ తదనంతరం 1851లో మరో రెండు పాఠశాలల్ని నెలకొల్పారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు.

పూలే కేవలం శూద్ర వర్ణాల్లో అణిచివేతకు గురౌతున్న కులాల ప్రజల పక్షాన పోరాడటమే కాకుండా, అగ్రవర్ణ వితంతువుల పునర్వివాహానికి గొప్ప కృషి చేశారు.

బ్రిటిష్ వలస వాదులకు '1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు.

పూలే కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉండేవి.

సత్యశోధక సమాజాన్ని విస్తరింపజేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ నాయకులు కడెం లింగన్న , బిసి సంక్షేమ సంఘం నాయకులు వంగరి బ్రహ్మం , గౌడ సంఘం నాయకులు గిలకత్తుల రమేష్ గౌడ్ , వెంకన్న , బిజెపి పార్టీ నాయకులు ధీనదయాల్ , యాదగిరి, బుషిపాక ఉదయ్ , ఎర్ర గణేశ్ , పోరెల్ల లక్ష్మయ్య , ఏపూరి యాకన్న , రాజు , నవీన్ , నాగరాజు , విజయ్ , రాము సేట్ , సంజీవయ్య , నాగు వెంకన్న , చేను శ్రీనివాస్ , మురళి , తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ధర్మశాస్తా దేవాలయం లో అయ్యప్ప పడిపూజ





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** పదవ డివిజన్,చైతన్య నగర్, యన్ టి ఆర్ బైపాస్ రోడ్డు నందు నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. గురువారం, ఉత్తరా నక్షత్రం అయ్యప్ప స్వామి జన్మ దినోత్సవం సందర్భంగా స్వామివారికి పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామివారికి అత్యంత వైభవో పేతంగా పడిపూజ నిర్వహించారు. పడిపూజ కార్యక్రమం అనంతరం స్వాములకు భక్తులకు అల్పాహారం అందించినట్లు ఆలయ చైర్మన్ మేకల హనుమంతరావు తెలిపారు. ఈకార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు అట్లూరి మధు డాక్టర్ టి. వి. పుల్లంరాజు, సరిపూడి నాగేశ్వరావు, పొన్నం వీర వసంత కుమార్, వల్లభనేని రామారావు, వెంపటి సత్యనారాయణ మాల ధరించినస్వాములు భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**తెలంగాణ ముచ్చట్లు :** :సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, విద్యావేత్త, రచయిత, సంఘ సేవకుడెట్కన జ్యోతీరావ్ ఫులే జయంతి పురస్కరించుకొని తిరుమలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళా విద్యకు పునాది వేసి1848 లో పుణేలో తొలి బాలికల పాఠశాలను స్థాపించారు. ఇది భారతదేశంలో తొలి బాలికల పాఠశాల. ఆయన అన్నివర్గాలకు విద్యను అందించాలన్న సంకల్పంతో పాఠశాలలు, గ్రంథాలయాలు స్థాపించారు. బాల్యవివాహాన్ని వ్యతిరేకిస్తూ, బాలికలకు విద్య అవసరమని ఆయన గట్టిగా నమ్మారు. 1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఉద్యమించారు. ఇది బ్రాహ్మణాధిపత్యం, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది. ఆయన రచించిన గులాంగిరి అనే గ్రంథం దాస్య జీవితం మీద ప్రబల విమర్శ. ఇది అణగారిన వర్గాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబాపూలే సేవలు మరువలేనివి

**తెలంగాణ ముచ్చట్లు :** బహుజనుల సంక్షేమానికై కాంక్షించిన మహానేత, దేశ విద్యాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే సేవలు మరువలేనివని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ , పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అన్నారు.శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.నేడు అందరికీ విద్యావకాశం ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పూలే వంటి ఎందరో మహనీయుల దయవల్ల నేడు ప్రతి ఒక్కరికి చదువుకునే అవకాశం లభిస్తుందని గుర్తు చేశారు.అలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ బాగా చదువుకొని ఉన్నత విద్యాభివృద్ధికి ఎవరికివారు కృషి చేసుకోవాలని సూచించారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు లభించి బతుకు బాగుంటుందని తెలిపారు.పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి బాగా చదివి పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ బొంకురి, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ యూనిట్ టు కోఆర్డినేటర్లు రేష్మ, గజెల్లి మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నేడు సిపిఐ ఆందోళన

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపులో భాగంగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 12న అన్ని మండల, జిల్లా కేంద్రంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. బిజెపి లౌకిక వాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని సురేష్ ఆరోపించారు. మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన ఎన్నికల్లో లబ్ధి పొందెందుకు మాత్రమే ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో బిజెపికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట క్రమంలో ఈ ఆందోళనను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకత్వం అన్ని మండలాల్లో ఆందోళనలు జరిగేవిధంగా చూడాలని కోరారు.

# హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**తెలంగాణ ముచ్చట్లు :** హన్మకొండ లోని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతి రావు పులే చిత్ర పటానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అద్యక్షులు %�csa% ఎం.ఎల్.ఏ. శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడతూ.. సమాజంలో అణగారికి వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త,మానవతావాది, మహాత్మా జ్యోతిరావు పూలే. పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తి దాయకమని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష శ్రీమాన్, వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, జిల్లా %×చీుఖజ% చైర్మన్ కూర వెంకట్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్, సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, జన్ను రవి, గోరంటల రాజు,మల్లం కుమర్,బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మా రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA, Printed at Amulya Publications and Printers Graphics, H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda, 506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor: BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in